
సాక్షి
బాపట్ల
శనివారం । 30 । నవంబర్ । 2024



లక్ష బిల్వార్చన

నకరికల్లు: నర్శింగపాడులోని గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామికి శుక్రవారం లక్షబిల్వార్చన నిర్వహించారు. విశేష పూజలు, హోమాలు చేశారు.



ఆనందీశ్వరునికి అభిషేకాలు

చెరుకుపల్లి: కార్తిక మాసం, మాసశివరాత్రి సందర్భంగా గుళ్ళపల్లిలోని గంగాంబిక సమేత ఆనందీశ్వర స్వామికి శుక్రవారం 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

త్రికోటేశ్వరునికి రుద్రాభిషేకాలు



నరసరావుపేట రూరల్: మాసశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి శుక్రవారం రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన చేశారు. పుష్పాలంకరణ సేవ జరిపారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: అమరేశ్వరాలయంలో శుక్రవారం దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్ష బిల్వార్చనను అలయ అర్చకులు, వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని చేశారు. స్వామికి విశేష అలంకరణ అనంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండేశ్వరి దేవికి లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో క్వారీ బాలకోటేశ్వరస్వామి



చేబ్రోలు: కార్తిక మాసం చివరి శుక్రవారం కావటంతో చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. శ్రీరంగపురం గ్రామంలోని మోహనరంగ నాయక స్వామి దేవస్థానంలో మహిళలు గోపూజ చేశారు. సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. చేబ్రోలు నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి



పొన్నూరు: తుపాను నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులలో ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. పొలాల్లో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, తొందరపడి నష్టానికి ధాన్యాన్ని విక్రయించవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరను అందిస్తుందని తెలిపారు.

రైతుల గుండెల్లో అలజడి

- తుఫాన్‌గా మారిన వాయుగుండం
- ఈదుర గాలులతో నేలవాలుతున్న పైర్లు
- కోత కోసేందుకు జంకుతున్న రైతులు
- జిల్లాలో 2.16 లక్షల ఎకరాల్లో వరిసాగు
- ఇప్పటికి 3 వేల ఎకరాల్లో మాత్రమే కోతలు

వణికిస్తున్న 'ఫెంగల్'



ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో నేలవాలిన పైరు



పిట్టలవానిపాలెం మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న పొలం

బాపట్ల టౌన్: అష్టకష్టాలు పడి వరిసాగు చేసిన రైతులకు ఫెంగల్ రూపంలో దూసుకొస్తున్న తుఫాన్ కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రెండు రోజులుగా చిరుజల్లులతో కూడిన వర్షం పడుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో ఈదురు గాలులు వీస్తుండటంతో కోతకొచ్చిన పైర్లు నేలవాలిపోతున్నాయి. భారీ వర్షం కురిస్తే పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోతకు సిద్ధంగా పొలాలు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.16 లక్షల ఎకరాల సాగుచేయగా వాటిల్లో ఇప్పటివరకు 3 వేల ఎకరాల్లో మాత్రమే కోతలు కోశారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాలకు పైగా కోతకు సిద్ధంగా ఉన్నాయి. మరో పది రోజుల్లో 40 వేల ఎకరాలు సిద్ధం కానున్నాయి. మిగిలిన పైర్లు పొట్ట, పాలు పోసుకునే దశలో ఉన్నాయి. వీటితో పాటు మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన వేరుశెనగ, మినుము, మొక్కజొన్న పైర్లు కూడా కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడున్న పరిస్థితిలో వర్షం పడితే జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగుచేసిన అన్ని పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

వరుస నష్టాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి

ఈ ఏడాది పొలాలకు నీటి ఎద్దడి సమస్య ఉన్నప్పటికీ రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటూ పంటను కంటికిరెప్పలా కాపాడుకున్నారు. నాట్లు వేసే సమయంలో వచ్చిన వర్షాలకు మొత్తం మునిగిపోయాయి. అధిక రేట్లకు నారును కొనుగోలుచేసి రెండోసారి వేశారు. నాట్లు వేసిన 20 రోజులకే మరోసారి వర్షాలు పడటంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒకటికి రెండుసార్లు పంటలు దెబ్బతిని రైతులు అల్లాడిపోతున్నా కూటమి నేతలు, అధికారులు కుమ్మక్కై, పచ్చ పార్టీకి చెందిన కార్యకర్తలకు మాత్రమే పరిహారం అందించి అర్హులకు మొండి చేయి చూపించారు. పంటలు పూర్తిగా దెబ్బతిని కనీసం నష్టపరిహారం కూడా అందక ఇప్పటికే అల్లాడిపోతున్న రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భయంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో చేసిన అప్పులు తీర్చలేక, బ్యాంకర్లు కొత్తరుణాలు ఇచ్చేందుకు ముందుకురాకపోవడంతో పుస్తులు తాకట్టుపెట్టి వ్యవసాయాన్ని చేశారు. మూడు రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో క్షణం క్షణం కలవరపాటుకు గురతున్నారు.

ఏ క్షణాన ఏమవుతుందో ?

జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల జిల్లాలోని వరిపైర్లు కోతకు సిద్ధంగా ఉన్నాయి. చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో కొంతమేర కోతలకు సిద్ధంగా ఉండగా, మరికొంత పొట్ట, పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ. 20 నుంచి 25 వేలు మేరా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుత తరుణంలో వర్షం వస్తే కోతకు సిద్ధంగా ఉన్న వరిపైర్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పుడే పాలు పోసుకునే దశలో ఉన్న పైర్లకు గింజలోపలికి నీరు వెళ్లి మానుకాయ పడే అవకాశం ఉంది. ఇక పండిన పొలాలు గింజ రాలిపోతుందేమోనని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పొట్టదశలో ఉన్న పైర్ల మొవ్వులోకి నీరు వెళ్లి తాలు గింజలుగా మారే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

వర్షం వల్ల తీవ్ర నష్టం



ఆరుగాలం కష్టించి పండించి న్నప్పటికీ చివరి దశలో వస్తున్న వరుణుడు మా ఆశలపై నీళ్లు చల్లాడు. గతంలో కూడా ఇదే సమయంలో వర్షం రావడం వల్ల పొలాలు పూర్తిగా నేలవాలిపోయాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అదే విధంగా ఉన్నాయి. ఈ సమయంలో వర్షాలు పడితే పైర్లు నేలవాలి గింజలు భూమి పాలు కావడం ఖాయం. ఇప్పటికే కొన్ని పొలాలు నేలవాలాయి. పైకిలేపి కట్టలు కట్టినందుకు ఒక్కో మనిషికి రూ. 500 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఒక్కో ఎకరాకు ఇప్పటికే రూ. 25 వేల మేరా ఖర్చు పెట్టాం. అసలు పండించిన పంట చేతికి వస్తుందో.. రాదో అనే భయంతో బతుకుతున్నాం.

– నర్రా పిచ్చియ్య, ముత్తాయపాలెం

నేలవాలిన పైర్లను పైకి లేపి కట్టలు కట్టాలి



పైర్లు నేలవాలి ఉంటే వాటిని పైకి లేపి కట్టలు కట్టాలి. దీనివల్ల మొక్కకు గాలి, వెలుతురు తగిలి తేమ శాతం తగ్గుతుంది. కోతకు సిద్ధమైన పైర్లు అయితే గింజలో తేమ శాతాన్ని తగ్గించేందుకు కట్టలు కట్టిన వాటిపై ఎకరాకు 200 లీటర్ల నీటిలో 5 కేజీల ఉప్పును కలిపి పిచికారీ చేయాలి. ఇప్పుడే ఈని పాలు పోసుకునే దశలో ఉన్న పైర్లు అయితే తెగుళ్ల వ్యాపించకుండా మందులు పిచికారీ చేయాలి. కోతలు కోసిన ఓదెలపై నీరు నిలిస్తే బయటకు తీసి ఉప్పు ద్రావణాన్ని జల్లాలి. నూర్పిడి అయితే ధాన్యం తడవకుండా మెరక ప్రాంతాలకు తరలించి పట్టాలు కప్పుకోవాలి.

– రామకృష్ణ , జిల్లా వ్యవసాయాధికారి

సమస్యల పరిష్కారం కోసమే 'పరిష్కార వేదిక'

- అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు నిర్మిస్తాం
- ప్రభుత్వ పథకాల్లో అవినీతిని సహించం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు గాను ప్రతి మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండల కేంద్రం కొరిశపాడులో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ గృహాలు కట్టించి ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సబ్సిడీతో మండలంలో 40 యూనిట్లు పశువుల షెడ్లు మంజూరు చేశామన్నారు. అవకతవకలు లేకుండా పూర్తి చేస్తే రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో నిర్మిస్తామని ఆయన చెప్పారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ వెంకటరమణ, ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు, సీడీపీవో కృష్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మట్టి బొక్కుతున్న పచ్చకొక్కులు

- పెదమట్లపూడి జగనన్న కాలనీలో అక్రమ తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు
- నిరుపేదల ఇళ్ల స్థలాల మట్టిని అమ్ముకుంటున్న వైనం
- అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరుతున్న గ్రామస్తులు



పెదమట్లపూడిలోని జగనన్న కాలనీలో మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంతలు

నగరం: టీడీపీ నేతల అవినీతి నిరుపేదల పాలిట శాపంలా మారింది.కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారి ఆగడాలకు హద్దూ అదుపు లేకుండా పోయింది.అధికారాన్ని అడ్డంపెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ నాయకుల అగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కూడా జీ హుజూర్ అంటూ వారికే వత్తాసు పలుకుతుండటంతో నిరుపేదలు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

యథేచ్ఛగా మట్టి తరలింపు

మండలంలోని పెదమట్లపూడిలో అధికారులు 64 మంది నిరుపేదలకు సుమారు 90 సెంట్ల స్థలాన్ని కేటాయించి జగనన్న కాలనీని ఏర్పాటుచేశారు. ఇండ్ల స్థలాలకు మట్టితో మెరక తోలించడంతో పాటు రహదారులను ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు ఇంటి పట్టాలను సైతం పంపిణీ చేశారు. జగనన్న కాలనీపై టీడీపీ నాయకులు కన్ను పడింది. ఇంకేముంది.. కాలనీలో ఇళ్లస్థలాల మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు.అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.మట్టి అక్రమ తరలింపును ఆపాలని రెవెన్యూ అధికారులకు విన్నవించిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఇళ్ల పట్టాలు పొందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పెదమట్లపూడి జగనన్న కాలనీలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే విషయం ఇప్పుడే తన దృష్టికి వచ్చింది. తరలించేవారిపై చర్యలు తీసుకుంటాం.

– నాంచారయ్య, తహసీల్దార్



జేసీబీతో మట్టిని ట్రాక్టర్‌లో వేస్తున్న దృశ్యం

సరోగసి ద్వారా ఒంగోలు జాతి అభివృద్ధి

ప్రముఖ పశు వైద్యుడు సోమశేఖర్



సరోగసి పద్ధతి ద్వారా జన్మించిన ఒంగోలు జాతి గిత్తను పరిశీలిస్తున్న వైద్యులు

మార్టూరు: నిల్వ ఉంచిన గిత్తల వీర్యంతో అద్దె గర్భం ద్వారా ఒంగోలు జాతి పశుసంపదను అభివృద్ధి చేసుకుందామని ప్రముఖ పశు వైద్యుడు సోమశేఖర్ పిలుపునిచ్చారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బొల్లాపల్లిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు జాతి ఆవులు, గిత్తలకు ప్రపంచ ప్రఖ్యాతి ఉందని రైతులు వీటిని పోషించడం ద్వారా వ్యవసాయపరమైన, ఆర్థిక పరమైన ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. స్థానిక నరసింహస్వామి ఆలయంలోని ఆవుకు గతేడాది డాక్టర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ నిర్వహించగా జన్మించిన ఒంగోలు జాతి దూడ 'నరసింహ'ను ఆయన పరిశీలించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సరోగసి పద్ధతి ద్వారా ఒంగోలు జాతి పశు సంపద సృష్టి కోసం విశేష కృషి చేస్తున్న డాక్టర్ సోమశేఖర్‌ను గతంలో ఆయనకు సహకరించిన కోలలపూడి పశువైద్యురాలు మాధవీలతను జిల్లా అధికారుల సమక్షంలో గ్రామ రైతులు, రైతు సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్, మార్టూరు ఏడీఏ పీవీ నరసింహారావు, రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అఖండ జ్యోతి ప్రజ్వలన



ఆలయం ముందు జ్యోతి ప్రజ్వలన

మార్టూరు: కార్తిక మాసం సందర్భంగా శుక్రవారం మార్టూరు జాతీయ రహదారి పక్కన గల దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. కమిటీ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తున్న 300 కిలోల కర్పూరంతో నిర్వహించిన జ్యోతి ప్రజలనతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. రూ.1లక్ష వ్యయంతో బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పలు రకాల పుష్పాలతో ఆలయంలోని దుర్గామల్లేశ్వర స్వాములను అలంకరించారు. ధ్వజ స్తంభం ముందు పుష్పాలతో అలంకరించిన శివలింగాకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయ్యప్ప, శివ, భవాని తదితర మాలధారుల శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో మార్టూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సీఐ మద్దినేని శేషగిరిరావు సిబ్బందితో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఏపీ జ్యుడీషియల్ టాపర్ మన అమ్మాయే



సత్తెనపల్లి: కృషి, పట్టుదల ఉంటే అనుకున్నది సాధించవచ్చు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి తగ్గట్లుగా శ్రమిస్తే కోరుకున్న ఏ రంగంలోనైనా రాణించవచ్చు. క్రమశిక్షణ, అంకితభావం, సమాజానికి మంచి చేయాలన్న తపన ఇవే ఎవరినైనా ఉన్నత స్థానంలో నిలబెడతాయి. సరిగ్గా ఈ కోవకు చెందినవారే యర్రం షాలినిరెడ్డి. ఆమె ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ పరీక్షల్లో టాపర్‌గా మొదటి స్థానంలో నిలిచి సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆమె పూర్వీకులు పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడు గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు వలస వెళ్లారు. యర్రం కరుణాకర్‌రెడ్డి, రేఖ దంపతుల కుమార్తె షాలిని రెడ్డి. కరుణాకర్‌రెడ్డి మంచిర్యాలలో ప్రైవేట్ విద్యాసంస్థను స్థాపించారు. సతీమణి రేఖ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. చిన్నతనం నుంచి కష్టపడే తత్వం కలిగిన షాలిని రెడ్డి టెన్త్‌లో 97 శాతం మార్కులతో, ఇంటర్మీడియట్‌లో 97 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచారు. ఎల్‌ఎల్‌బీ, హైదరాబాద్ అడల్ రామిరెడ్డి కళాశాలలో, ఎల్‌ఎల్‌ఎం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసి టాపర్‌గా పేరు తెచ్చుకున్నారు. తెలంగాణలో ఎన్‌రోల్ చేసుకుని కొంతకాలం ప్రాక్టీస్ కూడా చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసులో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆమె పోటీ పడ్డారు. త్రుటిలో అవకాశం కోల్పోయారు. దీంతో మరింత పట్టుదలతో షాలిని రెడ్డి కష్టపడ్డారు. ఈ ఏడాది జనవరిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జ్యుడీషియల్ సర్వీస్‌లో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేశారు. ఆగస్టులో గుంటూరు జిల్లా నల్లపాడులో ప్రిలిమినరీ రాశారు. సెప్టెంబర్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాత పరీక్ష, వైవాలో ప్రతిభ కనబర్చి 238.67 మార్కులతో 68.19 శాతం సాధించారు. ఈనెల 6న ముఖాముఖిలో ప్రతిభ చూపారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో మొదటి స్థానం దక్కించుకొని ఏపీ టాపర్‌గా నిలిచి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు.

ప్రతి ఓటమి ఓ పాఠం

జ్యుడీషియల్ పరీక్షలు రాయాలంటే పట్టుదల ప్రధానం. నేను రెండో యత్నంలో విజయం సాధించాను. ఎంతో మానసిక ఒత్తిడి ఉంటుంది. దాన్ని తట్టుకుంటూ సీనియర్లు, జూనియర్లతో చర్చించి తప్పిదాలపై సమీక్షించుకుని ముందుకు సాగాను. ప్రతి ఓటమి ఓ పాఠంలా ముందుకు సాగాలని షాలిని రెడ్డి తెలిపారు. ఆమె జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో ఇక్కడ ఉన్న ఆమె బంధువులు మురిసిపోయారు. సత్తెనపల్లి, లంకెలకూరపాడులోని పలువురు శుక్రవారం ఆమెకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.



తల్లిదండ్రులు కరుణాకర్‌రెడ్డి, రేఖలతో షాలినిరెడ్డి

విద్యాశాఖలో భారీగా బదిలీలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఉప విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి. విజయ రామరాజు గురువారం రాత్రి విడుదల చేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలువురికి స్థాన చలనం కలిగింది. గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా ఉన్న పి.వెంకటేశ్వరరావును పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీఎస్ఈఆర్‌ఎంసీ) అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.లావణ్యకు సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా స్థాన చలనం కలిగించగా, ఆమె స్థానంలో ఎస్.శైలజాబాయి నియమితులయ్యారు. నరసరావుపేట డీవైఈవోగా పని చేస్తున్న కె.వేణుగోపాల్‌ను విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయగా, అక్కడ పని చేస్తున్న పీవీ రమణను పల్నాడు డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయంలో పని చేస్తున్న పి. శ్రీనివాసరావును బాపట్ల జిల్లా ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్తగా నియమించారు. గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా తిరుపతిలో పని చేస్తున్న పీవీఎస్ లక్ష్మీ నారాయణకు పోస్టింగ్ ఇచ్చారు.

క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాభివృద్ధి



అద్దంకి రూరల్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాభివృద్ధి సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి అన్నారు. బొమ్మనంపాడు గ్రామం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రత్నకుమారి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటం వల్ల మనిషి ఆరోగ్యం దెబ్బ తినటంతో పాటు భూమి చౌడుబారుతుందని తెలిపారు. భూమిలో సేంద్రియ కర్బనాలు పెరగాలంటే పచ్చిరొట్ట సాగు చేశాలని సూచించారు. కార్యక్రమంలో అద్దంకి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏ. ధనరాజ్, మండల వ్యవసాయాధికారి కె. వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నేడు వలంటీర్ల నిరసన

గుంటూరు వెస్ట్: కూటమి ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా శనివారం నిరసన కార్యక్రమంతో పాటు ధర్నా నిర్వహిస్తామని గ్రామ వార్డ్ వలంటీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమయూన్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి స్థానిక జీఎంసీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటామని పేర్కొన్నారు. అక్కడ ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత ఒక మాట చెబుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగడతామని తెలిపారు. గ్రామ, వార్డు వలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ఫుల్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలు పెంచాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గురుకుల విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఫుల్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయుల వేతనాలను పెంచాలని కోరుతూ ఆర్థికశాఖ కార్యదర్శి జానకీని వెలగపూడిలోని సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ గురుకుల విద్యాసంస్థల్లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఫుల్ టైం గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు గౌరవ వేతనాన్ని 50 శాతం వరకు పెంచాలని ఎంతో కాలంగా చేస్తున్న వినతుల ఫలితంగా సంబంధిత శాఖ నుంచి ఫైల్‌ను జానకికి అందజేసినట్లు పేర్కొన్నారు. దీనిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వరి పొలాలపై మూషిక దాడి

- ఎకరానికి 5-10 సెంట్ల పంట నష్టం
- కొమ్మమూరు, సాగర్ ఆయకట్టులో మూడున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు
- రైతులకు రూ. 2 నుంచి 3 వేల వరకు అదనపు ఖర్చు
- జిల్లాలో ఎలుకలు నిర్మూలనకు రూ 7.5 కోట్ల ఖర్చు



కారంచేడులో దక్షిణ పొలాల వద్ద ఎలుకల కోసం సిద్ధం చేసిన బుట్టలు

కారంచేడు: వరి సాగుకు ఈ ఏడాది సానుకూల వాతావరణం లేదనే చెప్పాలి. అదునులో అవసరమైన వర్షాలు పడలేదు. కాలువల్లో సమృద్ధిగా సాగు నీరు లేక ఇబ్బందులు పడిన రైతులు ఎట్టకేలకు అలస్యంగానే సాగు చేపట్టారు. ప్రస్తుతం చేలు దుబ్బులతో పాటు, చిగురు దశలో ఉన్నాయి. ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని ఆశించిన రైతుల నెత్తిపై పిడుగు పడింది. ఊహించని విధంగా మూషికాల దాడి మొదలైంది. వేసిన పంట కళ్లెదుటే ముక్కలవుతుండటంతో వాటిని అంతమొందించే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, గతంలో కంటే ఈ ఏడాది ఎలుకలు పట్టడానికి ఒక్కో ఎకరానికి రైతులు సుమారు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ ఎకరానికి సగటున 5-10 సెంట్ల భూమిలో పంటను కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఆయకట్టు కింద మూడున్నర లక్షల ఎకరాల్లో సాగు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొమ్మమూరు ఆయకట్టు కింద లక్ష ఎకరాల్లో, సాగర్ కాలువ ఆయకట్టు కింద మరో రెండున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతున్నట్లు అంచనా. ఈ లెక్కన మూడున్నర లక్షల ఎకరాల్లో ఎకరానికి రూ.2000 చొప్పున సుమారు రూ.7.5 కోట్లను రైతులు ఎలుకలు పట్టించేందుకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలో అధికారిక, అనధికారిక లెక్కల ప్రకారం సుమారు లక్ష ఎకరాల్లో వరిసాగు అవుతోంది. వీటిలో ప్రధానంగా కారంచేడు మండలంలోనే 25 వేల ఎకరాల్లో సాగు అవుతోంది. ఇది కాకుండా పర్చూరు, చినగంజాం, వేటపాలెం, చీరాల, సంతరావూరు మండలాల పరిధిలో సాగు చేశారు. సాగర్ ఆయకట్టు కింద జిల్లాలో త్రిపురాంతకం, దర్శి, దొనకొండ, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు, అద్దంకి, మార్టూరు, బల్లికురవ మండలాల పరిధిలో సుమారు రెండున్నర ఎకరాల్లో వరి సాగు అవుతున్నట్లు అంచనా. కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల పరిధిలో ఎలుకలతో గట్లు కూడా గుల్ల అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. పట్టడానికి ఒక్కో ఎలుకకు రూ.20 నుంచి రూ. 30 లేదా కావిడికి రూ 600-800ల చొప్పున పట్టేవారికి చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఎలుకల బుట్టలకు పెరిగిన గిరాకీ

కొమ్మమూరు ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లో ఎక్కువగా ఎలుకల సంచారం ఉంది. దీంతో ఎలుక బుట్టలకు ప్రస్తుతం గిరాకీ ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. సగటున ఎలుకలు పట్టినందుకు రోజుకు రూ 600 నుంచి రూ. 1000 వరకు కూలీ వస్తుందని పట్టేవారు చెబుతున్నారు.

జీవనోపాధి బాగుంది

వరి చేలల్లో ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. దీంతో రైతులు వాటిని పట్టించడానికి అనేకమందిని పిలిపిస్తున్నారు. ఈ సీజన్‌లో మేం రోజుకు సగటున రూ.500 నుంచి రూ 1000 వరకు సంపాదించుకుంటున్నాం. రైతులకు ఇబ్బందిగా ఉన్నా మాకు మాత్రం జీవనోపాధి బాగుంది.

– ఎం పెంచలయ్య, ఎలుకలు పట్టే వ్యక్తి, కారంచేడు

గత ఏడాది కంటే ఎక్కువగా పెరిగాయి

గత మూడు, నాలుగేళ్ల కిందట ఎలుకల బెడద ఎక్కువగా ఉండేది. చేలల్లో నీటి శాతం తక్కువగా ఉండటం వల్ల గడిచిన మూడేళ్లుగా అంతరించిపోయాయి. ఇప్పుడు మళ్లీ దాడి పెరిగింది. చేలల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. గత ఏడాది కూడా ఉన్నాయి గానీ ఈసారి మరీ ఎక్కువడా ఉన్నాయి.

– వై. జీవన్‌కుమార్, రైతు, కారంచేడు

అంతర్ పంటలతో ఆదాయం అధికం

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): రబీ సీజన్‌లో అంతర్ పంటలు సాగు చేయటం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రకృతి వ్యవసాయం మండల కోఆర్డినేటర్లకు పిట్టలవానిపాలెంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, అంతర్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. డీపీఎం వాణిశ్రీ మాట్లాడుతూ అంతర్ పంటల సాగు వల్ల చీడపీడలను నివారించుకోవచ్చని చెప్పారు. మినుములో నల్లనువ్వులు, ఆవాలు, పచ్చజొన్నలు, గోంగూర పైర్లు సాగు చేయవచ్చని సూచించారు. వేరుశనగ పైరులో పొద్దు తిరుగుడు నల్లనువ్వులు, ఆవాలు, గోంగూర, సజ్జ లాంటి పైర్లు సాగుచేసి అదనపు ఆదాయం పొందాలని చెప్పారు. అనంతరం దశపర్ణి కషాయం, బీజామృతం తదితర కషాయాల తయారీపై కో– ఆర్డినేటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం బాపట్ల మాస్టర్ ట్రైనర్ గంజి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు 50 శాతం ఐఆర్ మంజూరు చేయాలి

కొరిటిపాడు(గుంటూరు): రాష్ట్రంలోని 4 లక్షల మంది పెన్షనర్లకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని వినతిపత్రం ద్వారా కోరినట్లు పెన్షన్‌దారుల చర్చా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర వీరయ్య శుక్రవారం తెలిపారు. కొత్త పీఆర్‌సీనివేదిక ఎప్పటికి వస్తుందో తెలీదన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులు, పెన్షనర్ల ఆగ్రహాన్ని చల్లబరిచేందుకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

బాపట్ల: ప్రభుత్వం బీసీలకు అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బాపట్లలోని కలెక్టరేట్‌లో బీసీ రుణాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈడీ మాట్లాడుతూ బీసీల్లోని అన్ని కులాలకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లాలో 2,875 మందికి రాయితీలు ఇచ్చేందుకు రూ.47.60 కోట్లు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. 52 రకాల యూనిట్లు ఏర్పాటు చేసేందుకు రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. రాయితీ రుణాలు పొందేందుకు జనవరి 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, కార్యదర్శి మారం రవికుమార్, బాపట్ల జిల్లాలోని బీసీ సంఘాల కుల నాయకులు పాల్గొన్నారు.

రేపు జ్వాలా దీపోత్సవం



బాపట్ల: సుందరవల్లి సమేత క్షీర భావనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం కార్తిక ఐశ్వర్య జ్వాలా దీపోత్సవం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు బి.బాబునాగేంద్రం తెలిపారు. ఆర్యవైశ్య మహాసభలో దీపోత్సవం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. బాబునాగేంద్రం మాట్లాడుతూ జ్వాలా దీపోత్సవం సాయంత్రం నాలుగు గంటల నుంచి మంగళ వాయిద్యాలు, వేద పారాయణం, శ్రీ శివస్వామి ఆశీస్సులతో ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా జ్వాల తోరణ పూజ, కార్తిక ఐశ్వర్య జ్వాలా దీపోత్సవం, ఉమామహేశ్వరుల పల్లకీ సేవ, శాంతి మంత్రం, ప్రసాద వితరణ జరుగుతుందని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సత్యనారాయణ, సోమరౌతు నాగభూషణం, బెల్లంకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించండి

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ ఆదేశించారు. శుక్రవారం తుళ్ళూరులోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. భూ వ్యవహారాలు 45, ప్రణాళికా విభాగం 2, భూ సర్వే 1, డెవలప్‌మెంట్ ప్రమోషన్‌లకు సంబంధించి రెండు అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్ డేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి. రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ తీగల చోరీ



కాలనీలో కత్తిరించిన విద్యుత్ తీగలు

వేమూరు: స్థానిక జగనన్న కాలనీలో విద్యుత్ తీగలను గుర్తు తెలియని కత్తిరించుకుపోయిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు వేమూరులోకి కాలనీలో 750 కుటుంబాలకు అధికారులు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. మొత్తం విద్యుత్ లైన్ వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలనీకి విద్యుత్ సరఫరాను పంచాతీయతీ అధికారులు నిలిపి వేశారు. దీంతో దొంగలు అదును చూసుకుని 9.5 కిలోమీటర్లు విద్యుత్ తీగలు కట్ చేసుకొని వెళ్లారు. వీటి విలువ సుమారు రూ 7 లక్షల ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కాలనీలో విద్యుత్ తీగలు దొంగతనంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి తెలిపారు. కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీ పేరు కూడా మార్పు చేసింది. ప్రధాన మంత్రి అవాజ్ యోజన పథకం పేరు పెట్టింది. ఈ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులపై గృహ నిర్మాణం శాఖ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. కాలనీకి విద్యుత్ నిలిపి వేయకపోతే దొంగలు విద్యుత్ తీగలను కట్ చేసే వారు కాదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. విద్యుత్, గృహ నిర్మాణం శాఖల అధికారులు చొరవ తీసుకొని కాలనీలో విద్యుత్ తీగలు వేయాలని వారు కోరుతున్నారు.

చురుగ్గా చప్టా నిర్మాణ పనులు



వెల్లటూరు చానల్‌కు అడ్డుగా కర్రల ఏర్పాటు

భట్టిప్రోలు: వెల్లటూరు చానల్ పరిధిలో భట్టిప్రోలు మెయిన్ డ్రైయిన్‌పై కూలిన పురాతన చప్టా నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. చప్టాపై కూలిన శిథిలాలను తొలగించి ఇసుక బస్తాలు వేసి తాత్కాలికంగా దిగువకు సాగు నీరు అందించేందుకు ఇరిగేషన్ శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం వెల్లటూరు చానల్‌కు సాగు నీరు నిలుపుదల చేశారు. పనుల నిర్వహణకు ఇబ్బందులు కలగకుండా చప్టా వరకు చేరుకునే కాల్వ కట్టపై చెట్టు, చేమలను జేసీబీతో తొలగించారు. వెల్లటూరు చానల్ నుంచి దిగువకు ఊట వస్తుండటంతో అడ్డుగా కర్రలు పాతారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కురిసిన వర్షాలకు సాగు చేసిన వరి పంట ఒకటికి రెండు సార్లు దెబ్బతిని రైతులు ఇప్పటికే నష్ట పోయారు. రబీ సీజన్‌లో సాగునీరు విడుదలవుతుందనే గంపెడు ఆశతో జొన్న, మొక్కజొన్న, అపరాలు సాగుచేసేందుకు సన్నాహాలు చేసుకునే తరుణంలో చప్టా కూలిపోవడంతో రైతుల ఆశలు ఆవిరైపోయాయి. ఇరిగేషన్ శాఖాధికారులు సాగు నీరు అందించే విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని పలువురు కోరుతున్నారు.

బాపట్ల ఎమ్మెల్యే ఎక్కడ ?

- గెలిస్తే ఇల్లు కట్టిస్తానంటూ గిరిజనులకు హామీ
- ఎన్నికలైన తర్వాత కనీసం తొంగికూడా చూడలేదు
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ఆగ్రహం



గిరిజనుల కాలనీలోని దుర్భర పరిస్థితిని చూపిస్తున్న శ్రీధర్

బాపట్ల టౌన్: ఎన్నికల్లో గెలిస్తే అందరికీ తక్షణమే ఇల్లు నిర్మించి ఇస్తానంటూ ప్రచారం చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రస్తుతం ఎక్కడ ఉన్నారంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.బి. శ్రీధర్ ప్రశ్నించారు. ఆయన శుక్రవారం పట్టణంలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీ గిరిజన కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూడటానికి ఎమ్మెల్యే ఎప్పుడు వస్తారంటూ ప్రశ్నించారు.? గత రెండు నెలల కిందట కురిసిన వర్షాలకు ఈ ప్రాంతం అంతా చెరువును తలపిస్తోందని, ఇల్లు వదలి ఎక్కడకు వెళ్లాలో తెలియక ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన పాలకులు తర్వాత కనిపించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, మంచినీరు, కరెంటు తదితర మౌలిక వసతులతో పాటు రేషన్ కార్డులు కూడా కరువైనట్లు తెలిపారు. గిరిజనులకు పక్కా ఇల్లు నిర్మించి వారి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు, ఉద్యమాలను ఉధృతం చేస్తామని శ్రీధర్ తెలిపారు.

మూడేళ్ల చిన్నారిపై వృద్ధుడు లైంగికదాడికి యత్నం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

చినగంజాం: మూడేళ్ల చిన్నారిపై తాత వరుస అయ్యే వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శీలం రమేష్ అందించిన సమాచారం ప్రకారం.. బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని ఓ గ్రామానికి చెందిన భార్యాభర్తలు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ గ్రామంలో పెళ్లికి హాజరయ్యేందుకు మంగళవారం తమ మూడేళ్ల చిన్నారిని తీసుకొచ్చారు. బాగా పొద్దు పోయేంత వరకు పెళ్లి హడావుడిలో ఉన్న వారు అలసిపోయి బుధవారం ఉదయం వరకు ఇంటిలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో వారి మూడేళ్ల కుమార్తె ఇంటి బయట ఆడుకుంటోంది. అదే కాలనీకి చెందిన చిన్నారికి తాత వరుస అయిన 60 ఏళ్ల చాట్ల అంజయ్య ఇంటి బయట తన ఈడు పిల్లలతో ఆడుకుంటున్న చిన్నారిని ఉద్దేశపూర్వకంగా ఇంటి సమీపంలో ఉన్న జొన్న చేనులోకి తీసుకెళ్లాడు. అక్కడ చిన్నారికి ముద్దులు పెడుతూ లైంగికంగా వేధిస్తుండటంతో బాలిక పెద్దగా కేకలు వేసింది. ఆ సమయంలో ఉపాధి పనులకు వెళుతున్న స్థానిక యువకులు, మహిళా కూలీలు కేకలు విని అక్కడకు వచ్చి అంజయ్యను గట్టిగా మందలించడంతో అతడు తప్పు జరిగిపోయింది తనను క్షమించాలని కోరాడు. దాంతో వారు అతనిని మందలించి చిన్నారిని ఇంటి దగ్గర వదలిపెట్టి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ఉపాధి కూలీల్లోని ఓ మహిళ 28వ తేదీ చిన్నారి తల్లితో పాటు మరికొందరు మహిళలతో పిచ్చాపాటి మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పింది. ఆమె సమాచారం భర్తకు చెప్పడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు చాట్ల అంజయ్యపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి


నరసరావుపేట టౌన్: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్వో మురళిని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ తెలంగాణ మాదిరి పేస్కేల్ అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులను వీఆర్‌ఏలతోనే చేత భర్తీ చేయాలన్నారు. అక్రమ డ్యూటీలు రద్దు చేయాలని, డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట మండల అధ్యక్షులు రోశయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, రొంపిచర్ల మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయంలోనూ నిధుల గోల్‌మాల్

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జోగి రాజా

బాపట్ల: విజయవాడ బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు బాపట్ల మున్సిపాల్టీ నుంచి ఖర్చు పెట్టిన వాటిలో కూడా అధికారులు రూ.10లక్షలు మింగేశారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జోగి రాజా ఆరోపించారు. వరదల్లో బాపట్ల మున్సిపాల్టీ పెట్టిన ఖర్చు వివరాలను తాను ఆర్టీఏ చట్టం ద్వారా కోరినప్పటికీ ఇవ్వకుండా ఇబ్బందులుపెట్టారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మున్సిపాల్టీ అధికారులు 68రోజుల తరువాత సమాచారం ఇచ్చారని తెలిపారు. మున్సిపాల్టీ సాధారణ నిధుల నుంచి రూ.45.55లక్షలు చేసినట్లు సమాచారం ఇచ్చారన్నారు. ఇందులో రూ.10లక్షలకు సంబంధించిన ఖర్చుల వివరాలు ఇవ్వకపోవటం వెనుక అధికారుల పాత్రపై అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. సరైన లెక్కలు చూపని అధికారులపై చర్యలు తీసుకోవడానికి విచారణ చేపట్టాలని జోగి రాజా ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

దేశ కీర్తిని పెంచేందుకు క్రీడలు దోహదం



విజేతలతో బాలానంద కేంద్ర అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలో మన దేశానికి కీర్తిని ఆర్జించి పెట్టేవి క్రీడలేనని బాలానంద కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. కృష్ణానగర్‌లోని లోటస్ ఆద్య పాఠశాలలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల స్థాయి విద్యార్థుల అండర్-14, 16 జిల్లా స్థాయి త్రో బాల్, కబడ్డీ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాలకు పైగా బాలానంద కేంద్రం తరపున రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, క్రీడా పోటీల ద్వారా వేలాది మందిని దేశం, రాష్ట్రం గర్వించదగ్గ పౌరులుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల నుంచి తలపడిన జట్లలో అండర్-14 కబడ్డీలో పిడుగురాళ్లలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విన్నర్, గుంటూరులోని ఆద్య పాఠశాల రన్నర్‌గా నిలిచినట్లు తెలిపారు. అండర్-16 విభాగంలో పిడుగురాళ్ల స్కాలర్స్ స్కూల్ విన్నర్, నరసరావుపేటలోని సింధు స్కూల్ రన్నర్‌గా నిలిచినట్లు వివరించారు. అదే విధంగా త్రో బాల్ అండర్-14 విభాగంలో తాడేపల్లి గుడ్‌న్యూస్ స్కూల్, లోటస్ ఆద్య విన్నర్, రన్నర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. అండర్-16 విన్నర్స్, రన్నర్స్‌గా సెయింట్ జోసెఫ్ పాఠశాల సర్టిఫికెట్స్, ట్రోఫీలు అందుకున్నారు. కార్యక్రమంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు జీవీ శివ ప్రసాద్, బాలానంద కేంద్ర కోశాధికారి జి.సంధ్య శ్రీ,, లోటస్ ఆద్య విద్యా సంస్థల డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, ప్రిన్సిపల్ వేణి శ్రీ,, పీఈటీ పవన్ చక్రి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాహుకేతు పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు



పెదకాకాని: కార్తిక మాస అమావాస్య ఆదివారం సందర్భంగా శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో రాహుకేతు గ్రహ పూజలు జరిపించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉప కమిషనరు కె.బి. శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రాహుకేతు పూజ మండపం వద్ద ప్రత్యేక టెంట్లు, క్యూలైన్, తాగునీరు వంటి వసతులు కల్పించినట్లు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు రాహుకేతు పూజ టిక్కెట్లు ఆలయ ప్రధాన కౌంటరులో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.